విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

వామపక్ష నేతలతో డివై దాసు సమావేశం

విశాలాంధ్ర-కూచిపూడి : పామర్రులో మే 13వ తేదీన జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ, సీపీఎంలు బలపరిచిన ఇండియా కూటమి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పామర్రు నియోజకవర్గానికి పోటీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డి.వై.దాసుతో గురువారం వామపక్ష నేతలు సమావేశమయ్యారు. సీపీఐ పామర్రు నియోజకవర్గ కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శులు కోసూరు వెంకట అప్పారావు, చందోలు నాగేశ్వరరావు, నియోజకవర్గ ప్రత్యేక ఆహ్వానితులు కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు కోదాటి నారాయణరావు, సీపీఎం తరపున జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె శివ నాగేంద్రం, జిల్లా కమిటీ సభ్యులు నారాయణరావు, మండల కమిటీమాజీకార్యదర్శి మద్దుల బసవరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ ఎన్నికలలో తనకు పూర్తి సహాయ సహకారాలు అందించి గెలుపునకు కృషి చేయాలని కోరారు. అలాగే 2009-14 వరకు పామర్రు నియోజకవర్గ ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో అభివృద్ధిని ప్రస్తావిస్తూ దీనిని కూడా గ్రామాలలో ప్రచార అస్త్రంగా వినియోగించుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు. ఈనెల 24వ తేదీన నిర్వహించే నామినేషన్ దాఖలు కార్యక్రమానికి సీపీఐ, సీపీఎం పార్టీల నుంచి నాయకులతో పాటుకార్యకర్తలు కూడా అధిక సంఖ్యలో హాజరుకావటానికి కృషి సల్పాలనికోరారు. ఈ కార్యక్రమంలో వీరితోపాటు జిల్లాలోని ప్రాంతాల నుంచి తరలివచ్చిన కాంగ్రెస్ నాయకులు కూడా పాల్గొన్నట్లు తెలిపారు.

ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించండి : సంజీవరెడ్డి

విశాలాంధ్ర-పెదపారుపూడి : ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని జాతీయ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వింత సంజీవరెడ్డి అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పామర్రులో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే డివైదాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా వింత సంజీవరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఐ, సీపీఎం బలపరిచిన కాంగ్రెస్ కూటమి అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే డి వై దాస్ పామర్రు ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నందున నియోజకవర్గ పరిధిలోని ఆయా పార్టీల కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రజల వద్దకు వెళ్లి గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలను వివరిస్తూ ముందుకు సాగాలని సూచించారు. రాబోయే ఎన్నికలలో ఇండియా కూటమి అభ్యర్థిగా డివై దాసుని గెలిపించి అసెంబ్లీకి పంపాలని పలువురు వ్యక్తులు వివరించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ మొవ్వ మోహన్ రావు, పిసిసి ఉపాధ్యక్షులు ధనేకుల మురళీమోహన్ రావు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు తాడిశెట్టి సాంబశివరావు, డిసిసి ఉపాధ్యక్షురాలు కొడాలి బసవమ్మ కాంగ్రెస్ పార్టీ ఐదు మండలాల అధ్యక్షులు, నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ నామినేషన్

విశాలాంధ్ర-గన్నవరం : గన్నవరం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కుటమి అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావ్ గురువారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. గన్నవరం నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో ఎన్నికల అధికారి గీతాంజలి శర్మకు రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందచేశారు. వెంకట్రావ్ ను పరిమి అజయ్ కుమార్, కొల్లా ఆనంద్ లు ప్రతిపాదిస్తూ నామినేషన్ పత్రాలపై సంతకాలు చేశారు. యార్లగడ్డకు డమ్మీ అభ్యర్థిగా వెంకట్రావ్ సతీమణి జ్ఞానేశ్వరి గురువారం ఉదయం నామినేషన్ వేశారు. ఆమె ఒక సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మీడియాతో మాట్లాడుతూ గన్నవరంలో కుటమి నాయకులు కార్యకర్తల మద్దతుతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. గన్నవరంలో మెజార్టీ వైసీపీ శ్రేణులు, గన్నవరం అభివృద్ధిని కాంక్షించే తటస్తులు తనకు ఓట్లు వేసి గెలిపిస్తారన్న నమ్మకాన్ని యార్లగడ్డ వ్యక్తం చేశారు. కాగా ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు కుటమి నాయకులు, కార్యకర్తలు భారీ జనసందోహం నడుమ మరో సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

విశాలాంధ్ర-కూచిపూడి : ఈనెల 25వ తేదీ వరకు దాఖలు చేసేందుకు తెలియపరిచే ఎన్నికల నోటిఫికేషన్. ప్రతులను గురువారం ప్రభుత్వ కార్యాలయాల వద్ద ప్రకటించారు. మొవ్వ ఎండిఓ.జి.చంద్రశేఖర రావు ఆదేశాలతో ఆ వివరాలను పత్రికలకు విడుదల చేశారు. మొవ్వ లోని ఎండిఓ, తహసిల్దార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద, మండలంలోని 16 సచివాలయాలు వద్ద పంచాయతీల గ్రేడ్ వన్ కార్యదర్శులు ఎం.ఎస్.ఎస్. మూర్తి, ఏ డి వి ఎల్ ప్రసాద్, ఇస్లావత్ భవాని, దేగల ఝాన్సీ లక్ష్మి, వక్కలగడ్డ నరసింహారావు, కళ్ళేపల్లి సోమేశ్వరరావు, గ్రేడ్ 5 కార్యదర్శులు, సచివాలయాల సిబ్బంది సహకారంతో ఏర్పాటు చేశారు. పార్లమెంటు అభ్యర్థి మచిలీపట్నం రిటర్నింగ్ అధికారికార్యాలయంలోకాని, సహాయ ఎన్నికల రిటర్న్ అధికారి కార్యాలయంలో గాని, ఎమ్మెల్యే అభ్యర్థి పామర్రు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వద్ద పామర్రు తాసిల్దార్ కార్యాలయంలో పబ్లిక్ సెలవు దినాలు మినహా మిగిలిన రోజుల్లో నామినేషన్లు దాఖలు చేయాలని పేర్కొంటూ నామినేషన్ కు సంబంధించిన పూర్తి వివరాలను నోటిఫికేషన్ ద్వారా విడుదల చేశారు. పూర్తి వివరాలను ఆయా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల ద్వారా గాని, సహాయ రిటర్నింగ్ అధికారుల ద్వారా గాని తెలుసుకోవాలని సూచించారు.

అధినేతల రాకతో హీటెక్కిన ప్రచారం

- అన్ని చోట్లా దాదాపు ద్విముఖ పోరే - మండే ఎండల్లో అభ్యర్థుల ఆపసోపాలు

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం: జిల్లాలో ఎన్నికల ప్రచారం నోటిఫికేషన్ విడుదల నాటికే హీటెక్కింది. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి, టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు, జనసేనా అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ లు ఇప్పటికే జిల్లాలో ప్రచార సభలు నిర్వహించడం తో ప్రచారం పీక్స్ కి వెళ్ళింది. సిఎం జగన్ గన్నవరం నియోజకవర్గం లో రోడ్ షో, గుడివాడ లో బహిరంగ సభ నిరహించగా, వారం రోజుల వ్యవధిలో చంద్రబాబు జిల్లాలో రెండు సార్లు పర్యటించి నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన సభల్లో పాల్గొనడం జరిగింది. జనసేనాని పవన్ కళ్యాణ్ చంద్రబాబు తో కలిసి పెడన, మచిలీపట్నం సభల్లో పాల్గొనడం తో పొలిటికల్ హీట్ ఒక్కసారిగా పెరిగింది. ప్రధాన పార్టీలు జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు తమ అభ్యర్థుల్ని ప్రకటించడం ద్వారా ఎన్నికల కోడ్ కంటే ముందే ప్రచారానికి కూత పెట్టారు అని చెప్పొచ్చు. పోటీలో వైసీపీ ఒంటరిగా బరిలోకి దిగుతుంటే, టిడిపి, జనసేనా, బీజేపీ పార్టీలు కూటమి పోటీ చేస్తున్నాయి. కాంగ్రెస్, వామపక్షాలు కలిపి ఇండియా కూటమిగా బరిలో వున్నాయి. బహుజన సమాజ్ పార్టీ కూడా అన్ని స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలో నిలుపుతున్నట్లు ఆ పార్టీ నేతలు ప్రకటించారు. అయినప్పటికీ అన్ని నియోకవర్గాల్లోనూ ద్విముఖ పోరే కనిపిస్తోంది. ఈ సారి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. గడిచిన వారం రోజుల గా ఎండలు మండిపోతున్న పరిస్థితుల్లో ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఆపసోపాలు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే ప్రచండ భానుడు తన ప్రతాపం చూపిస్తుంటే చెమటలు కక్కుకుంటూ పదకొండు గంటల వరకు ప్రచారం చేయడం కష్టంగా ఉంటుంది. మంచినీళ్ళు, మజ్జిగా, శీతల పానీయాలు లాంటివి అందుబాటులో వుంచుకుని ప్రచారం చేస్తుండడం తో ఖర్చు తడిసి మోపెడు అవుతుంది అంటూ నేతలు గగ్గోలు పెడుతున్నారు. రెండో పూట మాత్రం విరామం లేకుండా ప్రచారం చేస్తూ ఓటర్లను కలిసే ప్రయత్నం చేస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి ప్రచారం చేయడం ఇబ్బందిగా వున్నా చాపకింద నీరులా తాయిలాలు పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాలు జరిగిపోతున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే పథకాలు ఆపేస్తారని, పోలీస్ కేసులు పెడతారని మిన్నకుండిపోయిన ప్రజలు ఇప్పుడు రొడ్డెక్కుతుండడం తో ప్రతిపక్ష పార్టీల సభలు కిక్కిరుస్తున్నాయి.

మే డే వేడుకలు వాడవాడలా జరపాలి

విశాలాంధ్ర, మచిలీపట్నం టౌన్ : ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించాలని కృష్ణాజిల్లా ఏఐటీయూసీ కన్వీనర్ టి.తాతయ్య అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం మచిలీపట్నం ఏఐటీయూసీ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి ఓయల్‌రావు అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తాతయ్య మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా కార్మికులకు ఉద్యోగస్తులకు 8 గంటల పని విధానం కోసం చికాగో నగరంలో పోలీస్ కాల్పుల్లో అమరులైన కార్మికులు, తమరక్తాన్ని కార్మికజెండాగా ప్రపంచ కార్మిక వర్గానికి అందజేసిన రోజు మే 1 అని, అప్పటినుండి ప్రపంచవ్యాప్తంగా సంఘటిత, అసంఘటిత కార్మికులు, కోట్లాదిమంది ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలు చేస్తూ, అనేక విజయాలు సాధిస్తూ, మే 1వ తేదీన ఫ్యాక్టరీల దగ్గర ప్రభుత్వ కార్యాలయాలవద్ద అరుణ పథకాన్ని ఎగరవేయటం సాంప్రదాయంగా వస్తుందన్నారు. ఏఐటీయూసీ మచిలీపట్నం గౌరవ అధ్యక్షులు లింగం ఫిలిప్ మాట్లాడుతూ మచిలీపట్నంలోని ప్రభుత్వరంగ సంస్థలలో పనిచేస్తున్న అసంఘటిత కార్మికులు, మున్సిపల్, మెడికల్, ఆర్టీసీ, కాంట్రాక్ట్ కార్మికులు, ప్రభుత్వ ప్రైవేటు రంగ బ్యాంకుల ఉద్యోగస్తులు, ఎల్ఐసి ఉద్యోగులు వారి వారి కార్యాలయాల్లో వద్ద మే1వ తేదీన ఎర్రజెండాలు ఎగరవేయాలని, తద్వారా రాబోయే కాలంలోకార్మికులు, ఉద్యోగులకు అండగా పోరాటాలు నిర్వహించాలని అన్నారు.

పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఎమ్మెల్యే అభ్యర్థిగా వక్కలగడ్డ పావని నామినేషన్

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : సాధారణ ఎన్నికలు 2024 కు సంబంధించి గురువారం నామినేషన్ ప్రక్రియ మొదలైంది. గురువారం పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా ఎమ్మెల్యే అభ్యర్థిగా వక్కలగడ్డ పావని నామినేషన్ దాఖలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ స్వార్థపూరిత రాజకీయాలకు అతీతంగా సమాజానికి సేవ చేసే ఉద్దేశంతో తాను నామినేషన్ దాఖలు చేశానని, ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రతి ఒక్కరికి సామాజిక న్యాయం అందించేలా కృషి చేస్తానన్నారు. "సమాచార శాఖ నిర్లక్ష్య ధోరణి" మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ ముగిసినా నామినేషన్ కు సంబంధించి ఫోటోలు సాయంత్రం వరకు రిలీజ్ చేయకపోవడం, మచిలీపట్నంలో సమాచార శాఖ కు సంబంధించి ఒక డిడి, ఇద్దరు డివిజనల్ పిఆర్ఓ ఉన్నప్పటికీ సాయంత్రం వరకు రిలీజ్ కానీ ఫోటోలు. సాయంత్రం రిలీజ్ చేసిన ఫోటో నామినేషన్ పత్రాలు ఆర్డీవోకు ఇస్తున్నట్లు ఉన్నవి కాకుండా ఏదో ఒక ఫోటో ఇచ్చాం అన్న రీతిలో సంబంధంలేని ఫోటో ఇవ్వడంతో ఇదేమని అడిగితే నిర్లక్ష్య పూరిత సమాధానం ఇచ్చిన డిడి. సమాచార శాఖ లేని నియోజకవర్గం రెండు మూడు గంటలకి ఫోటోలు రిలీజ్ చేసిన ఆర్వోలు. గతంలో వచ్చిన ఫిర్యాదులపై అప్పటి కలెక్టర్ స్పందించకపోవడం తో డిడి ఆడింది ఆట పాడింది పాట కా సాగింది. ప్రస్తుత కలెక్టర్ ఏమి చేస్తారో చూడాలని ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.

ఎన్నికల కోడ్ అమలులో ఉందా ?

-గుడివాడలో పర్యటనల పేరుతో లక్షలు ఖర్చు!
-బేనర్లు, పోస్లర్లు తొలగిస్తే కోడ్ అములు అయినట్లేనా?
-రూ.100 కోట్లకు పైబడి ఖర్చు చేసేందుకు సిద్ధం ?

విశాలాంధ్ర-గుడివాడ : 2024 ఎన్నికలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం ఫిబ్రవరి 28వ తేది నుండి దేశవ్యాప్తంగా కోడ్‌ను అమలులోకి తీసుకువచ్చింది. అనాటి నుండి ప్రతి నియోజవర్గంలో ఎన్నికల సజావుగా జరిగేందుకు, ఓటర్లును ఎంటు వంటి ప్రలోభలకు గురికాకుండా చూసేందుకు ప్రతేక అధికారులను నియమించింది. ఎక్కడైనా కోడ్ ఉల్లంఘన జరిగితే కఠిన చర్యలు తీసుకోవడానికి ఎన్నికల అధికారులకు అధికారాలు ఇచ్చింది. ఎలక్షన్ కమిషన్ అఫ్ ఇండియా ప్రకటించిన విధంగా ప్రతి పార్లమెంట్ పరిధిలో రూ.90 లక్షకు మించి ఖర్చు చేయకూడదని, ప్రతి నియోజవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థి రూ.40లక్షల వరకు మాత్రమే ఖర్చు చేయాలని నిబంధన పెట్టింది. అయితే ఆది ఎంత వరకు అములు అవుతోంది. మొదటిలో ప్రత్యేక ఎన్నికల అధికారులు ఎక్కడ బేనర్లు, కనబడిని వాటిని తొలగించడం, విగ్రహాలకు ముసుగులు వేయడం, హోర్డింగులకు రంగులు వేయడం, అక్కడ, అక్కడ పోలీసు పికెట్‌గ్‌లు పెట్టి రసీద్ లేని డబ్బును సీజ్ చేయడం, మద్యం అక్రమ రవాణా నియంత్రణ, అభ్యర్థులు ఓటర్లులకు మద్యం, డబ్బులతో ప్రలోభ పెట్టకుండా ఎన్నికల నిఘా సంఘం ప్రర్యవేక్షించాలి. అయితే గుడివాడలో ఒక్కొక్క అభ్యర్థి వార్డు, గ్రామలలో వారి బలం చూపించేందుకు సుమారు రూ.12, 15లక్షల వరకు ఖర్చు పెడుతున్నారనేది భోగటా. పత్రిచోట డప్పుల వాయిదాయలు, పులదండలు, క్రేన్‌లతో గజమాలలు, బాణాసంచాలు పేల్చడం, ప్రత్యేకంగా కక్క ముక్కలతో భోజనాలు, మద్యం, వార్డు, గ్రామాల్లో వారి వెంట తిరిగే వారికి రోజు వారీ కూలి, పేదలకు నజారానలు, చర్చి, మసిద్, దేవాలయాల అభివృద్ధికి వెంటనే చెల్లింపులు చేయడం, పరిపాటిగానే మారింది, ఇప్పటికే ఒక్కొక్క పార్టీ రూ.25కోట్ల వరకు ఖర్చు చేసినట్లు వినికిడి. అది ప్రతి నియోజవర్గంలో జరిగే తంతు అనేది జగమేరిగిన సత్యం. ఇకపోతే నామి నేషన్ వేసే సమయంలో పార్టీల వారి బలబలాలు చూపించేందుకు లక్షలు మందితో ఊరేగింపుతో సుమారు కోటి రూపాయల వరకు ఖర్చు పెడతారని, అబ్బా మా నాయకుడు లక్షలు ఖర్చు పెట్టి నామినేషన్ వేశారని, పార్టీల నాయకులు బహిరంగంగానే చెబుతారు. ఇలాంటి విషయలలో ఎన్నికల సంఘం ఎమి చేస్తుంది. ఎందుకు పట్టించుకోవడం లేదు అనేది పలువురి ప్రశ్న. ఇటీవల సీఎం సభలో తమకు ఇస్తామన్న, డబ్బు, మద్యం పూర్తి స్థాయిలో ఇవ్వలేదని రాయితో దాడి జరిగిందని, అందుకే సీఎంపై దాడి జరిగిందని నిఘా వర్గాలు చెప్పడం విశేషం. అంటే ఒక సభను నిర్వహించాలంటే ఒకోక్క వక్తికి 300 నుండి 500 వరకు ఇస్తేనే ఏ సభకైనా ప్రజలు వెళ్ళాతారనేది. అందరికీ తెలిసిన వాస్తవమే. మా నాయకుడి సభకు లక్షమంది వచ్చారు. 2 లక్షలమంది వచ్చారు. అన్ని గొప్పలు చెప్పుకుంటున్నారు, అంటే ఎంత ఖర్చు పెడితే సభలకు ప్రజలు వస్తారు, లక్షాలది రూపాయిలు ఖర్చు పెడితేని సభలు సెక్సెస్ అవుతాయో అలోచించాలి. అయితే సీఎం సభ విషయంలో అది బహిరంగంగా ఆధారాలతో బయటకు వచ్చింది. అభ్యర్థుల ఎంపిక సమయంలో ప్రధాన పార్టీలు 100 కోట్ల ఖర్చు పెడతామంటేనే సీట్లు కూడా ఇచ్చారనేది వాస్తం కాదా? ఇది ప్రతి నియోజవర్గంలోనూ జరిగే తంతే. ఇక గుడివాడ విషయానికి వస్తే టిడిపి తరుపున ఎన్ఆర్ఐ, వైకాపా తరుపున నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి, పైగా మంత్రిగా కూడా పనిచేశారు. ఐదవసారి గెలిచి చరిత్ర సృష్టించాలని చూస్తున్న వ్యక్తి. ఇరు పార్టీలు ఈ ఎన్నికల్లో ఒకోక్కరు 150 కోట్ల నుండి 200 కోట్లు ఖర్చు పెట్టి ఎన్నికలకు సిద్ధమై బరిలోకి దిగడం జరిగిందని రాజకీయ మేధావుల అంచానాలు. ఇంత డబ్బును విచలవిడిగా ఖర్చుపెడుతున్న ఎందుకు ఎన్నికల సంఘం ప్రతేక అధికారులు చర్యలు తీసుకోవడం లేదో వారికే తెలియాలి. ఈ విషయమై ప్రతి ఒక్కరు అలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో, మచిలీపట్నం : సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ విధిగా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి జి.గీతాభాయ్ అన్నారు. గురువారం జిల్లాలోని నిడుమోలు, నిమ్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి,నిడుమోలులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న భవన నిర్మాణాన్ని పరిశీలించిన అనంతరం రోగులతో మాట్లాడుతూ ప్రజలు రోగనిర్ధారణ కొరకు వారి సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అందుబాటులో ఉన్న 63 రకాల వైద్య పరీక్షలను ఉపయోగించుకోవాల్సినదిగా సూచించారు. ముఖ్యంగా మధుమేహం ,రక్తపోటు ,మూత్ర పరీక్షలు చేయించుకొని వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి తగిన వైద్యసేవలనుపొందవలసినదిగా,ప్రత్యేకంగా ఎకో మరియు ఈసీజీ పరీక్షల కొరకు నిర్దేశించబడిన ఆధునిక వైద్య పరికరాలను ఉపయోగించుకొని గుండె సమస్యలను ముందుగా గుర్తించి తగిన వైద్య సేవలు, సలహాలు పొందాలన్నారు. ప్రజలందరూ వారికి సమీపంలోఉన్న గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ఆయుష్మాన్ భారత్ ప్రోగ్రామ్ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య మందిర్ కేంద్రాల ద్వారా అవసరమైన వైద్యారోగ్య సేవలను పొందాలన్నారు .వైద్యారోగ్య సేవల వినియోగం కొరకు ప్రతి ఆరోగ్య కేంద్రం నందు కావలసిన 172 రకాలమందులు ,యాంటీబయటిక్స్, వ్యాధి నిరోధక టీకాలు పూర్తిస్థాయిలోఅందుబాటులో ఉన్నాయని అన్నారు. అనంతరం వైద్యులను, సిబ్బందిని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో అమలు చేస్తున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష సమావేశమును నిర్వహించి,ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రత మరియు నిర్వహణ పై సంతృప్తి వ్యక్తం చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని వచ్చిన రోగులకు మంచినీటి వసతి ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిడుమోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఏ, సాయికిరణ్ మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది, నిమ్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రవిరాం మరియు సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దాం

విశాలాంధ్ర-పెడన : కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని పెడన నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి శౌంరి నాగరాజు అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీపీఐ, సీపీఎం నాలుగు మండలాల నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి అభిప్రాయాలు వారి సూచనలు తీసుకొని వారితో కలిసి ముందుకు వెళ్ళటానికి మరియు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అమూల్యమైన సందేశాలు ఇచ్చారు. నియోజకవర్గం లో ఉన్న సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు కట్టా. హేమసుందర్‌రావు, సిపిఎం నాయకుడు సజ్జా నాగేశ్వరరావు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ సిహెచ్ అప్పారావు అప్పారావు, లింగాల సుధాకర్ రావు, రాగి రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

22న అగ్నికులక్షత్రియ ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-అవనిగడ్డ : ఈ నెల 22 వ తేదిన అగ్నికులక్షత్రియ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, రాష్ట్ర బిసి నాయకులు, నియోజకవర్గ జనసేన నేత చిలకలపూడి పాపారావు అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ 22వ తేది ఎ.ఎస్.ఆర్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించనున్న అగ్నికుల క్షత్రియ సమావేశానికి మచిలీపట్నం పార్లమెంట్ కూటమి అభ్యర్థి వల్లభనేని బాలశౌరి, అవనిగడ్డ అసెంబ్లీ కూటమి జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్‌ల పాల్గొంటారని తెలిపారు.

ఓటర్ల పరిశీలన

విశాలాంధ్ర-కూచిపూడి : వచ్చేనెల 13వ తారీఖున నిర్వహించే సార్వత్రిక ఎన్నికలలో పోలింగ్ కేంద్రాల వద్దకు రాలేని హోమ్ ఓటర్ వివరాలపై ఆయా పోలింగ్ కేంద్రాల అధికారులు దృష్టి సారించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాల రోగగ్రస్తులు, ఇంట్లోంచి బయటకు రాలేని వ్యక్తుల పూర్తి వివరాలతో సేకరించిన సమాచారాలను ఆయా సచివాలయాల వీఆర్వోలకు పోలింగ్ కేంద్రాల బి ఎల్ ఓ లు అందజేస్తున్నట్లు సమాచారం. దీనిలోభాగంగానేమొవ్వ మండలంలో గల 21 గ్రామాలలోని54పోలింగ్ కేంద్రాల్లో గల హోమ్ ఓటర్ వివరాలు సేకరించి 16 సచివాలయాల విలేజ్ రెవెన్యూ అధికారులకు సమర్పించినట్లు తెలిసింది. వారు (వీఆర్వోలు) ఆ సమాచారం పై విచారణ నిర్వహించి స్పష్టమైన వివరాలను ఏ.ఆర్.ఓగా ఉన్న మండల తాసిల్దార్ కు అందజేసినట్లు తెలిసింది. ఈ విధంగా పోలింగ్ కేంద్రాలకు మండలంలో 60 నుంచి 100 లోపు ఉండవచ్చునని తెలుస్తోంది . అయితే వీటికి సంబంధించిన వివరాలు సిబ్బంది, అధికారులు గుట్టుగా ఉంచడం తో స్పష్టమైన సమాచారం తెలియ రాలేదు!.అయితే వీటిని అంచలంచలుగా సూపర్వైజర్స్, సెక్టోరియల్ అధికారులు పరిశీలించి నిర్ధారణ చేసి పామర్రు నియోజకవర్గఆర్.ఓ. అందజేసిన అనంతరం ఈ విధమైన ఓటింగ్.కు అర్హుల వివరాలను మండల తాసిల్దార్ కు అందజేసే అవకాశాలుంటాయన్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా హోమ్ ఓటర్ ల వివరాలుమాకుకూడా తెలియదని, జిల్లా అధికారుల నుంచి స్పష్టమైన నిబంధనలు వచ్చిన తర్వాతే దానిని బట్టి వివరాల సేకరణ జరుగుతుందనిగ్రామస్థాయి అధికారులు పేర్కొంటున్నారు. కాగా మరొక రెండు మూడు రోజులలో పూర్తిస్థాయి వివరాలు అందే అవకాశం ఉండవచ్చునని మొవ్వ తహసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి వెల్లడించారు.

వాణిజ్య వేత్త వెంకట రమణ మృతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : లలితా ఎంటర్‌ప్రైజెస్ అధిపతి, వాణిజ్య వేత్త సీతారామ వేద పరిషత్ మందిర వ్యవస్థాపక కార్యదర్శి విష్ణుభట్ల వెంకట రమణ (55) గురువారం ఉదయం 2 వ వార్డులోని తన నివాసంలో కన్నుముశారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె , తల్లిదండ్రులు, సోదరుడు ఉన్నారు. కుమారుడు అమెరికాలో విద్యను అభ్యసిస్తూ ఉండ టంతో శనివారం అంత్యక్రియలు జరగనున్నాయని బంధువులు తెలిపారు. గుండె జబ్బు కారణంగా వెంకట రమణ మృతి చెందినట్లు చెప్పారు. వేద శాస్త్ర పరిషత్ మందిరం (కళ్యాణ మండపం) నిర్మాణంలో వెంకట రమణ ప్రధాన భూమిక వ్యవహరించి నిర్మాణానికి అవసరం అయిన నిధులు సమకూర్చారు. ఆయన మృతికి పలువురు బ్రాహ్మణ సంఘాలతో పాటు మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్త పరిచారు. వెంకట రమణ మృతదేహాన్ని పలువురు ప్రజాప్రతినిధులు సందర్శించి నివాళ్ళు అర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

శతాదిక వృద్ధురాలు మృతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : భోగాది వెంకాయమ్మ (105) శతాదిక వృద్ధురాలు మృతి చెందింది. మండల పరిధిలోని వేకనూరు గ్రామానికి చెందిన భోగాది వెంకాయమ్మ గురువారం ఉదయం మృతి చెందింది. గత మూడు రోజులుగా వీస్తున్న వడగాలులకు అస్వస్తకు గురైన వెంకాయమ్మ ఇంటి వద్దే విశ్రాంతి తీసుకుంటూ మృతి చెందడంతో వారి బంధువులలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆమెకు ఒక కుమారుడు, ఇరువురు కుమార్తెలు కాగా కుమారుడు భోగాది రామును గ్రామంలో గొడవల నేపథ్యంలో హతమార్చడం జరిగింది. వెంకాయమ్మ మృత దేహాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు సందర్శించి నివాళ్ళు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

భానుడి భగభగ

విశాలాంధ్ర-పమిడిముక్కల: రోజు రోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు ప్రజలు విలవిల లాడుతున్నారు. వారం రోజులు గా పగటి ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో నమోదు అవుతున్నాయి. ఉదయం ఎడు గంటల నుండి భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. జనం బయటకు రావాలంటే జంకుతున్నారు. మండుతున్న ఎండలకు పగలే చుక్కలు చూస్తున్నారు. ఎండ కి తోడు వేడి గాలులు ఉక్కపోత తో వృద్ధులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పగలు సెగలు రాత్రి 9 గంటల అయినా చల్ల గాలి రాకపోవడంతో ప్రజలు సతమతమౌతున్నారు. ఎండ వేడికి ప్రయాణికులు వడదెబ్బ కు గురౌతున్నారు. గతంలో పల్లెల్లో పట్టణంలో మట్టి కుండలు తో చలువ పందిళ్ళు వేసి చలివేంద్రాలు పెట్టేవారు. కాలానుగుణంగా అలాంటివి కనుమరుగు అయ్యి, కృత్రిమంగా తయారు చేసిన కూలింగ్ నీరు ని అందిస్తున్నారు.ఉష్ణోగ్రత తట్టుకోలేక ఎంత ఖరీదైన చెరుకు రసం, జ్యూస్లు తాగుతున్నారు. దానిలో వాడే ఐస్‌ఏ నీరుతో తయారు అవుతుంది తేలియదు, దీనితో గొంతు సంబంధించిన వ్యాధులతో బాధపడుతున్నారు. ఇది వరకు రహదారులు వెంట పెద్ద వృక్షాలు ఉండేవి బాటసారులు సేద తీరెవారు, ప్రస్తుతం ఆ పరిస్థితులు లేవని ప్రయాణికులు వాపోతున్నారు. వృద్ధులు, అనారోగ్యులు చాలా జాగ్రత్తగా ఉండాలని వాతావరణం శాఖ హెచ్చరికలు చేస్తోందని వైద్యులు అంటున్నారు.

నామినేషన్లు ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ: సాధారణ ఎన్నికలు-2024లో భాగంగా విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన ఫారం-1 ఎన్నికల పబ్లిక్ నోటీస్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్.డిల్లీరావు గురువారం ఉదయం విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ ఈసీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా నామినేషన్లు స్వీకరించడం జరుగుతోందన్నారు. నామినేషన్ దాఖలుకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 18వ తేది ప్రారంభమైన ఈ నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈ నెల 25వ తేదీ వరకు కొనసాగుతుందని.. ప్రభుత్వ సెలవు దినాల్లో మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. అభ్యర్థులు గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, గరిష్టంగా రెండు నియోజకవర్గాల నుంచి నామినేషన్లను ఫైల్ చేయవచ్చన్నారు. నామినేషన్ల దాఖలు సమయంలో 100 మీటర్ల పరిధిలో గరిష్టంగా మూడు వాహనాలు మాత్రమే అనుమతించబడతాయని అభ్యర్థితో సహా ఐదుగురు వ్యక్తులు మాత్రమే ఆర్వో కార్యాలయంలోకి అనుమతించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు.

తొలిరోజు పార్లమెంటుకు రెండు నామినేషన్లు:

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి తొలిరోజు గురువారం ఇద్దరు వ్యక్తులు రెండేసి సెట్ల చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎస్.డిల్లీరావుకు నామినేషన్లు సమర్పించారు. సోషలిస్టు యునిటీ సెంటర్ ఆఫ్ ఇండియా (కమ్యూనిస్టు) పార్టీ నుంచి విజయవాడ, అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన గుజ్జుల లలిత (61) నామినేషన్ దాఖలు చేశారు. అదే విధంగా స్వతంత్ర అభ్యర్థిగా తెలంగాణ రాష్ట్రం, జనగామ జిల్లా, తరిగొప్పుల మండలం, సోలిపురం గ్రామానికి చెందిన అర్జున్ చేవిటి (33) నామినేషన్ దాఖలు చేశారు.

అసెంబ్లీ నియోజకవర్గాలు-నామినేషన్ల వివరాలు

తిరువూరు (ఎస్సీ) నియోజకవర్గం: నల్లగట్ల స్వామిదాస్ (వైసీపీ), విజయవాడ పశ్చిమ నియోజకవర్గం: సత్యనారాయణ చౌదరి యలమంచిలి (బీజేపీ), విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం: దుగ్గిశెట్టి సుభాషిణి (స్వతంత్ర అభ్యర్థి), మైలవరం నియోజకవర్గం:వల్లభనేని నాగ పవన్‌కుమార్ (స్వతంత్ర అభ్యర్థి), నందిగామ నియోజకవర్గం (ఎస్సీ): బి.శ్రీనివాసరావు (తెలుగు రాజాధికార సమితి పార్టీ), సుందరరావు కొత్తపల్లి (స్వతంత్ర అభ్యర్థి), జగ్గయ్యపేట నియోజకవర్గం: రాజగోపాల్ శ్రీరామ్(టీడీపీ), శ్రీదేవి శ్రీరామ్(టీడీపీ), కె.ప్రభుదాస్(బీఎస్పీ), నవీన్ అంబేద్కర్ చింతమల (నవరంగ్ కాంగ్రెస్ పార్టీ), జి.రాంబాబు(తెలుగు రాజాధికార సమితి పార్టీ) నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్టీఆర్ జిల్లాలో తొలిరోజు విజయవాడ తూర్పు నియోజకవర్గానికి ఒక్క నామినేషన్ కూడా రాలేదు.

స్వామిదాస్ నామినేషన్

విశాలాంధ్ర-తిరువూరు: నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లగట్ల స్వామిదాస్ గురువారం తన వైయస్సార్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో మాధవికి అందజేశారు. ఈ కార్యక్రమం లో నియోజకవర్గ పరిశీలకులు పూనూరు గౌతమ్ రెడ్డి, నియోజకవర్గ పార్టీ సీనియర్ నాయకులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్, నాయకులు రేగళ్ల మోహన్ రెడ్డి మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: విస్సన్నపేట అగ్నిమాపక, విపత్తుల నిరోధకశాఖ ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పలు విద్యాలయాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ ఇన్‌చార్జి అధికారి బి.నానిక ప్రమాదాల నివారణ, ప్రమాద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం అగ్నిప్రమాదాల సమయంలో తమశాఖ తీసుకునే చర్యలను ప్రదర్శించి చూపారు. పలువురు అగ్నిమాపక సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
ఎన్టీఆర్ జిల్లా

హాజరు వేస్తే నీకు సగం నాకు సగం

ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి కూలీల ఆందోళన

కన్నెవీడు ఫీల్డ్ అసిస్టెంట్ తొలగించాలని ఎంపీడీవో కి వినతి పత్రం

విశాలాంధ్ర-వత్సవాయి: కన్నెవీడు గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్గా విధులు నిర్వహిస్తున్న చిట్టెమ్మను విధుల నుంచి తొలగించాలని కనివిడి గ్రామం నుండి ఉపాధి హామీ కూలీలు భారీ స్థాయిలో మండల కేంద్రమైన వత్సవాయిలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు... స్పందించిన ఎంపీడీవో భరత్ రాజ్ వారితో మాట్లాడగా ఇటీవల కాలంలో ఫీల్డ్ అసిస్టెంట్ అవినీతికి పాల్పడుతుందని కూలీలతో చేయించాల్సిన పనులను కూలీల వద్దనుండి ప్రతి ఒక్కరి వద్ద నుండి 250 రూపాయలు వసూలు చేసి జెసిబి తో పని చేయిస్తుందని అదేవిధంగా పనికిరాని వారి కి సైతం కూలీల హాజరు పట్టికలో నమోదు కావడం మరియు వాస్తవంగా పనిచేసే వారికి వారం రోజులు చేస్తే కేవలం ఒక్కరోజు మాత్రమే హాజరు వేస్తున్నారని ఇదేమిటి అని అడిగితే మీకు దిక్కు ఉన్నచోట చెప్పుకోండి అని పొగరుగా సమాధానం చెబుతున్నారని వాపోయారు.... మొదటినుంచి చిట్టెమ్మ ఫీల్డ్ అసిస్టెంట్ గా కొనసాగడంతో మండలం మొత్తానికి నేనే అధికారిని అంటూ ఏ అధికారికి చెప్పిన నన్ను ఎవరు ఏమీ చేయలేరని అనే ధోరణితో ఉపాధి హామీ కూలీలను లెక్కచేయకుండా పని చేయించే దగ్గర కూడా చిట్టెమ్మ లేకుండా పనిచేసే ఆమె వద్దకు వెళ్లి హాజరు వేయించుకోవడానికి కిలోమీటర్ల దూరం నడవాల్సి వస్తుందని వాపోయారు అదేవిధంగా గ్రామంలో పలువురు వద్ద హాజరు వేసినట్లయితే వచ్చే డబ్బులలో చెరిసగం అనే కొత్త పంథాని అవలంబిస్తుందని... ఆమె చెప్పిన విధంగా వింటే హాజరు పట్టిలో పేరు నమోదు అవుతుంది... వినకపోతే నీకు పని లేదు అంటూ అందరి ముందే గొడవకు కాలు దిగుతుందని గ్రామం నుంచి వచ్చిన ఉపాధి హామీ కూలీలు తమ గోడును ఎంపీడీవో భరత్ రాజ్ ముందు వెళ్లబుచ్చారు... గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు పై క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాస్తవ అవాస్తవాలను వెలికి తీసి ఫీల్డ్ అసిస్టెంట్ పై వచ్చిన ఆరోపణలు నిజమని తెలిసినట్లయితే ఉన్నతాధికారుల సూచనల మేరకు ఆమెను విధుల నుండి తొలగించే విధంగా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళనను విరమించుకొని వెళ్లారు.

విజయవాడలో భారీ అగ్నిప్రమాదం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడ బందర్‌రోడ్డులో ఘోర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. బందర్‌రోడ్డులోని ఓ మెడికల్ గోదాంలో ప్రమాదవశాస్తూ అగ్నిపమాదం జరిగింది. గోదాంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకొని భారీగా పొగ వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈనేపథ్యంలోనే అగ్నిపమాపక సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో అగిప్రమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. కానీ అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి గోదాంలో పెద్ద ఎత్తున మంటలు ఎగసిపడ్డాయి. మెడికల్ గోదాం నుంచి ఎగిసిపడుతున్న మంటలు అర్పడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించారు. 5 ఫైర్ ఇంజన్‌ల ద్వారా మంటలను అదుపు చేశారు. ప్రమాదం జరిగే సమయంలో గోదాంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. గోదాంలో అగ్నిప్రమాదం కారణంగా రూ.కోట్లపైనే నష్ట కలిగి ఉండొచ్చని అంచనా వేస్తున్నారు.

మద్యం సీసాలు పట్టివేత

విశాలాంధ్ర-వత్సవాయి : 1190 మద్యం సీసాలను ఎక్సైజ్ పోలీసు లు స్వాధీనం చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన వత్సవాయి లోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రం సమీపంలో చోటుచేసుకుంది ... ముందస్తు రాబడిన సమాచారం మేరకు విజయవాడ ఇంటిలిజెన్స్ మరియు ఎన్ఫోర్స్మెంట్, రామ శివ మరియు జగ్గయ్యపేట సెబ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ మణికంత రెడ్డి రాబడిన సమాచారం మేరకు సంపద తయారీ కేంద్రానికి చేరువలో వరిగడ్డి వామిలో మద్యం బాక్సులను గుర్తించారు మొత్తం కలిసి 1190 సీసాలను స్వాధీనం చేసుకున్నారు వాటిని నిల్వ ఉంచిన వత్సవాయి గ్రామానికి చెందిన బెల్ట్ షాపు నిర్వాహకులైన చీకటిమల్ల గోపి షేక్ నాగులు వల్లం కొండ రమేష్ మరియు స్థల యజమాని అయిన వల్లం కొండ రమణయ్య పై కేసు నమోదు చేసినట్లుగా సెబ్ సీఐ తెలిపారు ఎన్నికల సమయం లో మద్యం దొరకదేమో అనే ఆలోచనతో ముందస్తుగా వరిగడ్డి వామిలో భద్రపరుచుకున్నారని నిందితులు తెలిపారు వీరిపై సంబంధిత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా పోలీసులు తెలిపారు.

తల్లిదండ్రులకు చెంతకు బాలుడు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : ఇంటి నుండి పారిపోతున్న మైనర్ బాలుడిని రక్షించి తిరిగి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పిగించిన టిటిఈ, ఆర్పీఎఫ్, జిఆర్‌పి సిబ్బందిని డిఆర్ఎం,సీనియర్ డిసిఎం అభినందించారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం కాకినాడ టౌన్‌లో నివాసం ఉంటున్న 17 ఏళ్ల రెహ్మాన్ అనే మైనర్ బాలుడు ఇంటర్మీడియట్ బోర్డ్ ఎగ్జామ్స్‌లో ఫెయిల్ కావడంతో బుధవారం సాయంత్రం 4.30 గంటల సమయంలో తల్లిదండ్రులను హెచ్చరిస్తూ ఇంటి నుంచి పారిపోయాడు. పిల్లవాడు ఇంటి నుండి పారిపోవడంతో తల్లిదండ్రులు కాకినాడలోని రైల్వే స్టేషన్,బస్టాండ్‌లో అతని ఆచూకీ గురించి స్థానికులను ఆరా తీశారు. బాలుడు రైలు నెం. 17210 కాకినాడ టౌన్- బెంగళూరు కాకినాడ టౌన్ స్టేషన్‌లో ఫోటోను గుర్తించి బాధిత తల్లిదండ్రులకు సమాచారం అందించారు. లైసెన్స్ పోర్టర్ నుండి సమాచారం అందుకున్న తర్వాత బాలుడి తండ్రి ఉస్మాన్ రాజమండ్రిలో నివసిస్తున్న అతని సోదరుడికి సమాచారం అందించారు.వెంటనే బంధువులు రాజమండ్రి రైల్వే స్టేషన్‌కు చేరుకుని బాలుడి ఫోటోతో ఆరా తీయడం ప్రారంభించారు. రాజమండ్రి స్టేషన్‌లోని చీఫ్ టికెటింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.చంద్రమౌళికి కుడా పిర్యాదు చేశారు. ఆయన వెంటనే స్పందించి ఎస్కార్ట్ ఆర్పీఎఫ్,జిఆర్‌పి రాజమండ్రి స్టేషన్ ఆర్పీఎఫ్ కు సమాచారం అందించారు.సాయంత్రం 6.43 గంటలకు రైలు రాజమండ్రి రైల్వే స్టేషన్‌లోని ప్లాట్‌ఫారమ్‌లోకి రాగానే కోచ్‌లను తనిఖీ చేయడం ప్రారంభించారు.ఎస్-11 కోచ్ వద్ద ఫుట్ బోర్డ్‌పై ఒక టీనేజ్ బాలుడు కూర్చోవడం గమనించాడు.అక్కడకు వెళ్లి బాలుడి ఆచూకీ గురించి ఆరా తీశారు. మెల్లగా బాలుడిని రైల్వేస్టేషన్‌లోని టిసి కార్యాలయానికి తీసుకువెళ్ళారు.అక్కడ బంధువులు బాలుడిని గుర్తించారు.టీసీ ఆర్పీఎఫ్ , జీఆర్‌పీ సిబ్బంది బాలుడికి కౌన్సెలింగ్ చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. అధికారులు సకాలంలో జోక్యం చేసుకుని, తమ కుమారుడి ప్రాణాలను కాపాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మైనర్ బాలుడిని రక్షించినందుకు రాజమండ్రిలో టికెట్ చెకింగ్ సిబ్బందిని డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ. పాటిల్,సీనియర్ డిసిఎం వావిలపల్లి రాంబాబు అభినందించారు.

ప్రజా సమస్యలపై పోరాడేందుకే పోటీ

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రానున్న సార్వత్రిక ఎన్నికలలో నేషనలిస్టు జనశక్తి పార్టీ (ఎన్‌జెపి) రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ,పార్లమెంట్ స్థానాలకు తమ అభ్యర్థులను పోటీకి నిలబెడుతుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కడియం సూరిబాబు తెలిపారు. గురువారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్షాలు ప్రజాస్వామ్య విలువలను తుంగలో త్రొక్కుతూ ఢిల్లీలోని కేంద్ర పెద్దలకు రాష్ట్ర ప్రజల హక్కులను తాకట్టు పెట్టేవిధంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలోని ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు, ప్రజా సమస్యల పట్ల చిత్త శుద్ధితో పోరాడేందుకు తమ పార్టీ సంసిద్ధం అవుతున్నదన్నారు.రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం ప్రధాన ధ్యేయంగా మీ ముందుకు వస్తున్న తమను ప్రజలు ఆదరించాలని కోరారు.ఈ సందర్భంగా ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థుల తొలి జాబితాగా 11 మంది అభ్యర్థులతో కూడిన తొలి జాబితాను ఆయన ప్రకటించారు. రాజంపేట పార్లమెంట్ అభ్యర్థిగా వెలిగారం వెంకటేశ్వర్లు ఆచారి,అనంతపురం పార్లమెంట్ అభ్యర్థిగా పాలూరి నీలకంఠాచారి,భీమవరం అసెంబ్లీ అభ్యర్థిగా కడియం సూరిబాబు, అసెంబ్లీ అభ్యర్థులుగా తిరుపతి నూతనపాటి ప్రసాద్, పెందుర్తి ఏలూరి వెంకటరమణ, శ్రీకాళహస్తి గానుగపెంట రమేష్, విజయవాడ పశ్చిమ అభ్యర్థిగా షేక్ మహబూబ్ భాష, రాజంపేట అసెంబ్లీ అభ్యర్థినిగా వెలిగారం లక్ష్మీదేవి, నగరి అసెంబ్లీ అభ్యర్థిగా కన్నా వెంకయ్య (వెంకట్), భీమిలి అసెంబ్లీ అభ్యర్థినిగా ఏలూరు ధర్మావతిని ప్రకటించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నగరానికి చేరుకున్న ఎన్టీఆర్ జిల్లా నియోజకవర్గాల ఎన్నికల వ్యయ పరిశీలకులు

విశాలాంధ్ర-విజయవాడ: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో జరిగే ఎన్నికల కోసం వ్యయ పరిశీలకులుగా నియమితులైన ఐఆర్ఎస్ అధికారులు గురువారం నగరానికి చేరుకున్నారు. విజయవాడ పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన వి.జస్టిన్, విజయవాడ పశ్చిమ, విజయవాడ సెంట్రల్, తిరువూరు, మైలవరం నియోజకవర్గాలకు సంబంధించి ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన సౌరభ్ శర్మ, విజయవాడ తూర్పు, నందిగామ, జగ్గయ్యపేట నియోజక వర్గాలకు ఎన్నికల వ్యయ పరిశీలకులుగా నియమితులైన మదన్ కుమార్‌లు గురువారం నగరానికి చేరుకున్నారు. వీరిని పంచాయతీరాజ్ అతిథి గృహంలో కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ లక్ష్యం

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: రాష్ట్రంలో బహుజన రాజ్యాధికారమే బీఎస్పీ పార్టీ లక్ష్యమని తిరువూరు నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి లక్కిపోగు వందన్‌కుమార్ అన్నారు. విస్సన్నపేట మండలంలోని పలు గ్రామాల్లో ఆయన రోడ్‌షో నిర్వహించి, పలుచోట్ల ప్రసంగించారు. రాష్ట్రవ్యాప్తంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు 85శాతం ఉండగా, 15శాతం ఇతర వర్గాల ఓటర్లు ఉన్నారన్నారు. వీరిలో కూడా బ్రాహ్మణ, వైశ్య తదితర వర్గాలు ఐదుశాతం ఉన్నాయని, కేవలం 10శాతం ఓటర్లు కలిగిన రెండు సామాజికవర్గాలు 73 సంవత్సరాలుగా రాజ్యాధికారం చెలాయిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికీ ఈ రెండు వర్గాలే ప్రధాన రాజకీయపార్టీలుగా ఉండి, అధికారం కోసం ప్రాకులాడుతున్నాయన్నారు. తిరువూరులో గత 30 సంవత్సరాలుగా ఒక పార్టీలో ఉన్న వ్యక్తి మూడు నిమిషాల్లో పక్కపార్టీలోకి వచ్చారని, తొమ్మిదేళ్లుగా ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఆయనను చూసి స్వగ్రామానికి పారిపోయాడని ఎద్దేవా చేశారు. మరోపార్టీ ఇక్కడ అభ్యర్థులే దొరక్క మరో ప్రాంతం నుంచి దిగుమతి చేసుకుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఇక్కడే పుట్టి, ఇక్కడే పెరిగానని, ఉన్నతోద్యోగిగా పాలనా వ్యవహారాలపై పట్టు ఉందని వివరిస్తూ, తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు.

గులకరాయి డ్రామాతో బీసీ బిడ్డలను బలిచ్చే కుట్ర: టీడీపీ

విశాలాంధ్ర-విజయవాడ: సీఎం జగన్ తన రాజకీయ స్వార్థం కోసం, సానుభూతి కోసం బడుగు బలహీన వర్గాలకు చెందిన బిడ్డల్ని రోజుకొకర్ని బలిస్తున్నాడని తెలుగుదేశం పార్టీ బీసీ సాధికార సమితి ప్రధాన కార్యదర్శి వీరంకి వెంకట గురుమూర్తి రాష్ట్ర వడ్డెర నాయకులు తెలుగుదేశం బీసీ విభాగం ప్రధాన కార్యదర్శి మల్లెల ఈశ్వరరావు ధ్వజమెత్తారు. విజయవాడలో జగన్‌పై గులకరాయి ఘటనలో సింగ్ నగర్ వడ్డెర కాలనీకి చెందిన బీసీ వడ్డెర యువకుల్ని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ.. కోర్టు వద్దకు చేరుకున్నారు. అరెస్టు చేయబడ్డ వేముల సతీష్ వేముల దుర్గారావు ఇతరుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. భయపడొద్దని, న్యాయం జరిగే వరకూ తోడుగా ఉంటామని భరోసా కల్పించారు. న్యాయవాది సలీంను కలిసి కేసు విషయాలు అడిగి తెలుసుకున్నారు. జగన్ తన అధికారాన్ని పదిలం చేసుకోవడం కోసం రోజుకో బడుగు బలహీన వర్గాల ప్రజల్ని బలిస్తామంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు మరక శ్రీనివాస్ యాదవ్ గుంటూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాసరావు వడ్డెర సాధికార సమితి రాష్ట్ర సభ్యులు బత్తుల దుర్గారావు విజయవాడ వడ్డెర సంగం ఉపాధ్యక్షులు వేముల దుర్గారావు రాష్ట్ర బీసీ సెల్ కార్య నిర్వాహ కార్యదర్శి సింగం వెంకన్న కత్తుల మణికంఠ రాష్ట్ర కార్యదర్శి వల్లూరు మధుసూదన్ రావు బెజవాడ తిరుపతి గౌడ్ విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పిరియా సోమేశ్వర రావు అమర్నాథ్ గౌడ్ వడ్డెర సాధికార సమితి ఎన్టీఆర్ జిల్లా సభ్యురాలు కుంచాల సావిత్రి సగర నాయకులు నంద్యాల నరసింహం తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రావణ్ కుమార్ నామినేషన్

విశాలాంధ్ర-తాడికొండ : తాడికొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ అభ్యర్థి తెనాలి శ్రావణ్ కుమార్ శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. స్థానిక అడ్డరోడ్డు సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవర ణలో నామినేషన్ దాఖలు చేయనున్నారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని పార్టీ కార్యాలయం కోరింది.

నామినేషన్ వేసిన జంజనం

విశాలాంధ్ర-తాడికొండ : తాడికొండ మండలం నిడుముక్కల గ్రామా నికి చెందిన జంజనం కోటేశ్వరరావు గురువారం మంగళగిరి మున్సిపల్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. కోటేశ్వరరావు ఆంధ్ర రాష్ట్ర సమితి అధ్యక్షులుగా కొనసాగుతున్నారు. తన స్వగ్రామం నిడు ముక్కల. దర్గాలో పూజలు నిర్వహించిన అనంతరంర్యాలీగా బయలు దేరి మంగళగిరి పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. తన మద్దతు దారులతో మున్సి పల్ కార్యాలయంలో నామినేషన్ వేశారు. అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీవై అభ్యర్థి ఎస్ఎస్ రాణి నామినేషన్ దాఖలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : నామినేషన్ ప్రక్రి య ప్రారంభమైన తొలి రోజు మొదటి నామినేషన్ బీసీవై అభ్యర్థి ఎస్ఎస్ రాణి ఆలియాస్ మహాలక్ష్మి గురువారం స్థానిక ప్రత్తిపాడు తహశీల్దార్ కార్యాలయంలో దాఖలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీరు, రోడ్ల సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, ప్రతి ఇంటికి వెళ్లి ఇంకా సమస్యల గురించి అడిగి తెలుసుకుని ఓటు వేయాలని అభ్యర్థిస్తానని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా గెలిచి ప్రజా సమస్యలను పరిష్కరిస్తానని ఆమె తెలిపారు.

అధికారపార్టీ వేధింపులపై అవగాహనకు నామినేషన్

విశాలాంధ్ర-విస్సన్నపేట టౌన్: గత ఐదేళ్ల కాలంలో అధికారపార్టీ నాయకులు చేసిన వేధింపులపై ప్రజలు దృష్టి సారించాలనే లక్ష్యంతో తాను నూజివీడు నియోజకవర్గం నుంచి స్వతంత్ర్య అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు కొండపర్వ గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త బొట్ల శిసత్యనారాయణ తెలిపారు. అధికార వైసీపీ నేతల అక్రమార్జన, సహజవనరుల దోపిడీపై సామాజిక కార్యకర్తగా, సమాచారహక్కు చట్టం కార్యకర్తగా ఉన్నత విద్యావంతుడనైన తాను పోరాడానని ఇందుకు ప్రతిగా తనపై అక్రమ కేసులు బనాయించి, జైలుపాలు చేయటమే కాక, రౌడీషీటు తెరచి వేధింపులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ఐదేళ్లుగా తనతోపాటు, పలు కుటుంబాలు వైసీపీ నేతల దౌర్జన్యకాండకు బలయ్యాయని వారి ఇబ్బందులను ప్రజలకు వివరించి, వైసీపీని ఓడించటమే లక్ష్యంగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వివరించారు.

మహారాజశ్రీ మాచర్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో
ఓ.ఎస్.నెం.439/2023

బిట్వీన్
బాణావత్ చంద్రలాల్ నాయక్ - వాది
వర్సెస్
కుంబా శ్రీకాంత్ - ప్రతివాది

ప్రతివాది అడ్రస్ : కుంబా శ్రీకాంత్, తండ్రి హనుమంతరావు, వయస్సు 38 సంవత్సరాలు, ఉద్యోగి, ప్లాట్ నెం.101, బ్లాక్ నెం.ఎ, సాయి కార్తీక పార్క్ వివ్, 2వ రోడ్డు, కనకదుర్గా నగర్, విజయవాడ - 520008, ఎన్.టి.ఆర్.జిల్లా.

పై నెంబర్ దావాసుమీపై బాణావత్ చంద్రలాల్ నాయక్ మాచర్ల మున్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో దాఖలు చేసినారు. సదరు దావాలో ఎన్ని పర్యాయములు శ్రీకోర్టువారు మీకు సమన్లు పంపినను మీరు అందుబాటులోనికి రానందున, శ్రీకోర్టువారు పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం నోటీసు అర్డర్ వేసి ఉన్నారు. కావున పై దావాలో మీరు శ్రీ కోర్టువారి ఎదుట ది. 14-5-2024న ఉదయం 10.00గంటలకు మీరు స్వయముగాగానీ, ప్లీడరు ద్వారాకానీ హాజరై మీ అక్షేవణలు తెలియజేయనియెడల పై దావానందు శ్రీకోర్టువారు మీ పరోక్షమున తీర్మానం చేయుదురని తెలియజేయటమైనది.
వాయిదా : 14-5-2024

కేళం శ్రీనివాసరావు, బి.ఎ., బి.ఎల్.,
వాది తరఫు న్యాయవాది, మాచర్ల,
పల్నాడు జిల్లా. సెల్ : 9866678701.

రైల్వేట్రాక్ వద్ద వ్యక్తి మృతదేహం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : రైల్వే ట్రాక్ వద్ద గుర్తు తెలియని మృతదేహం గుర్తుపట్టని విధంగా ఉండగా గుర్తించినట్లు రైల్వేపోలీసులు గురువారం తెలిఆరు. వారు తెలిపిన విధంగా సికింద్రాబాద్ నుండి విజయవాడ వచ్చు రైల్వే ట్రాక్ వద్ద చెరువుమాధవరం రైల్వేస్టేషన్ సమీంలో సుమారు 30 నుండి 40 సం.ల వయస్సు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిఉన్నట్లు బుధవారం తమకు సమాచారం వచ్చిందన్నారు.అక్కడకు వెళ్ళి పరిశీలించగా మృతుడు 5 అడుగుల ఎత్తుతో చామన ఛాయ రంగు కలిగి ఉన్నాడు.శరీరంపై గులాబి రంగు ఊల్‌హ్యాండ్ షర్టు, నలుఉ రంగు ఆ్యంట్ ధరించి ఉన్నాడు. రైలు నుండి జారీ పడిపోయినట్లుగా అనుమానిస్తున్నామన్నారు. దాదాపు 3 రోజులు కావటంతో మృతదేహం గుర్తుట్టని విధంగా ఉందనిన్నారు. ఇతర వివరాలు,అధారాలు లభ్యంకాలేదు.వివరాలు తెలిసినట్లయితే రైల్వే పోలీస్ స్టేషన్‌లో గాని, 9440627544, 0866-2576006 సంప్రదించాలని కోరారు

మంగళగిరిలో కోలాహలంగా నామినేషన్ దాఖలు

- 10 మంది అభ్యర్థులు 14 నామినేషన్లు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి నియోజక వర్గం నుంచి పోటీ చేసేందుకు నామినేషన్ల ప్రారంభ రోజైన గురువారం కోలాహలంగా నామినేషన్ దాఖలు చేశారు. సార్వత్రిక ఎన్నికలలో భాగంగా గురువారం ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు 10 మంది అభ్యర్థులు 14 నామినేషన్లు దాఖలు చేసినట్లు మంగళగిరి నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజకుమారి తెలిపారు. ప్రధాన ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తరపున టీడీపీ పార్టీ నాయకులు రెండు నామినేషన్లను దాఖలు చేశారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఆ పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్, భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు బోడే రామచంద్ర యాదవ్, జై భీమ్ రావ్ భారత్ పార్టీ నుంచి అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్, తెలుగు రాజ్యాధికార సమితి పార్టీ నుంచి అధ్యక్షులు జంజనం కోటేశ్వరావు, జంజనం పద్మలు ఒక్కొక్క నామినేషన్ సెట్‌ను దాఖలు చేశారు. వీరుతోపాటు ఇండిపెండెంట్ అభ్యర్థులుగా దానబోయిన వెంకట శివాజీ మూడు సెట్లు, బండ్ల బిక్షయ్య, నైనాల లావణ్యలు ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ప్రత్యేకించి తెలుగుదేశం పార్టీ నుంచి నామినేషన్ వేసేందుకు ఆ పార్టీ నాయకులు, కార్య కర్తలు వేలాదిగా ర్యాలీగా తరలివచ్చారు. అదేవిధంగా బీసీవై పార్టీ నుంచి బోడె రామచంద్ర యాదవ్ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా తరలివచ్చి నామినేషన్ దాఖలు చేయడం జరిగింది. ఏఆర్ఎస్ పార్టీ నుంచి అధ్యక్షులు జంజనం కోటేశ్వరావు, నగరంలో ర్యాలీ నిర్వహించి నామినేషన్ వేసేందుకు తరలివచ్చారు. నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ జలీల్, జై భీమ్ రావ్ పార్టీ అధ్యక్షులు జడ శ్రావణ్ కుమార్, కార్యకర్తల అభిమానులతో తరలివచ్చారు. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభ రోజైన ప్రధాన పార్టీలతో స్వతంత్ర అభ్యర్థులు కూడా నామినేషన్ దాఖలు చేయడానికి రావడంతో మంగళగిరి నగరం అంతా ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కోలాహలంగా మారింది.

రియల్ మీ పి 1 5జి విడుదల

హైదరాబాద్: రియల్ మీ పి 1 5జి శక్తివంతమైన మీడియా టెక్ డైమెన్సిటీ 7050 5జి చిప్‌సెట్, గొప్ప 120హెచ్‌జెడ్ ఏమోలెడ్ డిస్ప్లే, సూపర్‌ఫాస్ట్ 45 డబల్యు సూపర్ వూక్ ఛార్జింగ్ మరియు భారీ 5000ఎం.ఎ.హెచ్. బ్యాటరీని కలిగి ఉంది. ఈ పరికరం పక్షుల సంస్కృతి-ప్రేరేపిత డిజైన్‌ను మరియు అద్భుతమైన విజువల్స్‌ను సంగ్రహించడానికి 50 ఎం పి ఏ ఐ కెమెరాను కూడా ప్రదర్శిస్తుంది. రియల్ మీ పి 1 5 జి రెండు రంగులలో వస్తుంది: ఫీనిక్స్ రెడ్ మరియు పీకాక్ గ్రీన్ మరియు రెండు స్టోరేజ్ వేరియంట్‌లు: 6జిబి+128జిబి, ధర ఐఎన్ఆర్ 15,999 మరియు 8జిబి+256జిబి, ధర ఐఎన్ఆర్ 18,999.

ఈజీ సూపర్ ప్రీమియం శ్రేణిని ప్రవేశపెట్టిన ఈఎల్ జీఐ

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: తక్కువ ఖర్చులతో వినియోగదారులకు పరిశ్రమలో అగ్రగామి ఇందన సామర్థ్యాన్ని అందించడానికి ప్రఖ్యాత ఈజీ శ్రేణిని విస్తరిస్తుందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్-లూబ్రికేటెడ్ స్క్రూ ఎయిర్ కంప్రెసర్ల యొక్క ప్రఖ్యాత ఈజీ సిరీస్ పోర్ట్ ఫోలియో, ఈజీ ఎస్ పీ (సూపర్ ప్రీమియం)ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ కొత్త మెషీన్ లు కంప్రెస్డ్ ఎయిర్ టెక్నాలజీలో చెప్పుకోదగ్గ పురోగతిని సూచిస్తాయి. 90-110 కంప్రెసర్ సిరీస్లో తక్కువ జీవితకాల ఖర్చులతో వినియోగదారులకు 15 శాతం వరకు గణనీయమైన శక్తి సామర్థ్య లాభాలు, ఉత్తమ-తరగతి వారంటీ మరియు పనితీరును అందిస్తాయనీ చెప్పారు.ఐఈ4 సూపర్ ప్రీమియం మోటార్ల ద్వారా మెరుగుపరచబడిన ఈ కంప్రెసర్లు పెరిగిన శక్తి సామర్థ్యం కోసం అధునాతన డిజైన్, సాంకేతికతను అనుసంధానిస్తాయన్నారు. న్యూరాన్ 4 ఇండస్ట్రియల్ కంట్రోలర్లతో అమర్చబడి, ఈజీ సూపర్ ప్రీమియం మెషీన్లు సరైన పనితీరును నిర్ధారిస్తాయన్నారు. మిస్టర్ భవేష్ కరియా, (భారతదేశం, దక్షిణాసియా, ఆఫ్రికా మరియు మధ్యప్రాచ్యం) మరియు (సౌత్ ఈస్ట్ ఆసియా) ప్రెసిడెంట్, ఈఎల్ జీఐ ఎక్విప్మెంట్స్ లిమిటెడ్ ఇలా అన్నారు. "ఈఎల్ జీఐ వద్ద, సాంకేతిక పురోగతిని స్పష్టమైన సామర్థ్య లాభాలతో సమలేఖనం చేయడం మా స్థిరమైన నిబద్ధత అన్నారు. ఇందన సామర్థ్యం, పర్యావరణ స్థిరత్వానికి ప్రాధాన్యతనిస్తూ తయారీ సంస్థల కోసం ప్రత్యేకంగా రూపొందించబడిందన్నారు. అత్యాధునిక యూనిట్లు తమ వినూత్న లక్షణాల ద్వారా గణనీయమైన శక్తి పొదుపును నిర్ధారిస్తాయి, ఇవన్నీ యాజమాన్య ప్యాకేజీ యొక్క అత్యంత పోటీతత్వ మొత్తం ఖర్చుతో కూడి ఉంటాయనీ వివారించారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి 100 మందికి చేరిక

విశాలాంధ్ర-గుడివాడ : 19వ వార్డు వైసిపి ఇన్చార్జ్ గణపతి సూర్జం 100మంది వైసిపి నుండి టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము సమక్షంలో టిడిపిలో చేరారు. గురువారంస్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయంలోని ప్రజావేదికలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావులతో, కలసి వెనిగండ్ల రాము వైసీపీ నాయకులకు పార్టీ కండువాలు కప్పి టిడిపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల రాము మాట్లాడుతూ గుడివాడకు ఏం చేశాడో చెప్పే ధైర్యం బూతుల నానికి ఉందా అని సవాల్ విసిరారు. ఎన్ని నిధులు తెచ్చి మన ప్రాంతాన్ని ఎంత అభివృద్ధి చేశాడొ చెప్పలేము కానీ జూద క్రీడలు, గంజాయి విక్రయాలు, మట్టి మాఫియా, రియల్ మాఫియాలలో మన గుడివాడలో ఎంతో అభివృద్ధి చేశారని విమర్శించారు. తన షాడోకు గుడివాడ పాలన అప్పగించి, ఎమ్మెల్యే దోపిడీకే ప్రాధాన్యత ఇచ్చాడన్నారు.ప్రజలకు మంచి చేయడం కోసం మంచి వారందరూ టిడిపిలోకి వస్తున్నారన్నారు. ఎన్నికలలోపు వైసిపి ఖాళీ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

21, 22వార్డులో కొడాలి నాని ప్రచారం

విశాలాంధ్ర-గుడివాడ : 21, 22వ వార్డులో గురువారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఎన్నికల ప్రచారం 22వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అయన పార్టీ శ్రేణులు వార్డు ప్రజలతో కలిసి ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్ర అభివృద్ధిని ప్రజల మంచి కోసం సీఎం జగన్ చేసిన కార్యక్రమాలను వివరిస్తూ, గడపగడపకు ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు జగన్‌కు, చంద్రబాబుకు మధ్య జరుగుతున్న ఎన్నికలు కావని, పేదలకు చంద్రబాబు మోసాలకు మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. రాబోయే ఐదేళ్లలో మీరు ఏ దారిలో నడవాలని ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. జగన్‌కు ఓటేస్తే ఈ మంచి అంతా కొనసాగుతుందని, చంద్రబాబుకు ఓటేస్తే పథకాలన్నింటికీ ముగింపు పలుకుతారని ఆరోపించారు. ఈ కర్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు గొర్ల శ్రీను, మార్కెట్ యార్డ్ చైర్మన్ మట్టా నాగమణి, జిల్లా యూత్ అధ్యక్షుడు మెరుగుమాల కాళీ, జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, సీనియర్ నాయకులు పాలేటి చంటి, దుక్కిపాటి శశిభూషణ్, జిల్లా అధికార ప్రతినిధి ఎంవి నారాయణరెడ్డి, జడ్పిటిసిలు గోళ్ళ రామకృష్ణ, కందుల దుర్గాకుమారి, ఎంపీపీలు పెయ్యల ఆదాం, గద్దె పుష్పరాణి, తదితరలు పాల్గొన్నారు.

రూరల్ మండలంలో వెనిగండ్ల రాము ప్రచారం

విశాలాంధ్ర-గుడివాడ : గుడివాడ రూరల్ మండలంలోని బొమ్ములూరు గ్రామంలో టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గురువారం మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి అధ్వర్యంలో ఇంటింటి ప్రచారంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జిల్లా బిజెపి అధ్యక్షుడు గుత్తికొండ రాజబాబు, జనసేన ఇంచార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, టిడిపి శ్రేణులతో కలిసి వెనిగండ్ల రాము సీఎం జగన్ ప్రభుత్వ అసమర్థత - ఎమ్మెల్యేగా కొడాలి నాని చేసిన దోపిడీలు, అరాచకాలను ప్రజానీకానికి వివరిస్తు ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కొడాలి రామరాజు, లింగం ప్రసాద్, గుత్తా చంటి, దావులూరి సురేంద్రబాబు, సురే గాంధీ, అంగడాల సతీష్, కొదమల గంగాధర్, బుల్ల కింగ్. శౌంరి నాగేశ్వరరావు,శౌంరి గంగాధర్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికలలో వైసీపీ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

విశాలాంధ్ర-కూచిపూడి : వచ్చే నెల 13వ తారీకు జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పామర్రు నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు, మచిలీపట్నం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు కైలే అనిల్ కుమార్ కోరారు. ఆయన ఎన్నికల ప్రచారాన్ని తొలిసారిగా మొవ్వ మండలం నిడుమోలు శివారు వీరాయిలంక గ్రామంలో గురువారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా పూల వర్షంతో స్వాగతం పలికారు. అలాగే డప్పు వాయిద్యాల హోరులో కార్యకర్తల మోటార్ సైకిల్ ర్యాలీ తో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అనంతరం కోళ్ల పాలెం, పద్దారాయుడు తోట, రాచర్ల పాలెం, కాజ గ్రామాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే వచ్చి లబ్ధిదారులకు అందే విధంగా సచివాలయ, వాలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. దీనివల్ల అవినీతికి తావు లేకుండా గంటల తరబడి కార్యాలయం చుట్టూ తిరిగే అవకాశం లేకుండా పోయిందని స్పష్టం చేశారు. ఈ దశలో పెత్తందార్ల పక్షాన నిలిచే చంద్రబాబు నాయుడు అధికారంలోకి వస్తే ఈ రెండు వ్యవస్థలను రద్దు చేస్తారని పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చిన భవిష్యత్తులో కూడా మరింత అండగా ఉంటానని హామీ ఇస్తూ రాబోయే ఎన్నికలలో పామర్రు ఎమ్మెల్యేగా నన్ను, బందరు పార్లమెంటు సభ్యునిగా డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొండేటి ఇందిర, జడ్పిటిసి రాజులపాటి పార్వతి, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, ఆయా గ్రామ సర్పంచులు కొమరగిరి అంజలి, తాతా స్వప్న, కొడాలి భవాని, ఎంపీటీసీలు డొక్కు వెంకటేశ్వరరావు (వైస్ ఎంపీపీ), మురారి సత్యనారాయణ,ఎల్లమల్లి కుటుంబరావు, పేకేటి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ కందుల వెంకట కోటేశ్వరరావు, పార్టీ నాయకులు కాకర్ల శివకుమార్, ఏనుగు మోహన్ రావు, రాజులపాటి మురళి, కొడాలి మురళి,మండా శ్రీనివాసరెడ్డి మర్రివాడ భాబ్జిరెడ్డి, జోగి సాంబశివరావు, పేకెటీ సీతారామరెడ్డి తదితరులు సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజలంతా కూటమికి జై కొట్టారు : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసేన, తెలుగుదేశం పార్టీలోనికి అధికార పార్టీ నుండి భారీగా చేరారు. మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామానికి చెందిన గ్రామస్థులు గ్రామ సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం ఆధ్వర్యంలో గురువారం నియోజకవర్గ కూటమి జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో కూటమికి జై కొట్టారు. మండల జనసేన పార్టీ అధ్యక్షులు గుడివాక శేషు బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, ఉపసర్పంచ్ నాగరాణి, పంచాయితీ వార్డు సభ్యులు, వైయస్ఆర్‌సిపి కార్యకర్తలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో జనసేన, తెలుగుదేశం పార్టీల్లో చేరగా మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ కూటమి జనసేన అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ వారికి పార్టీ కండువాలను కప్పి మాట్లాడారు. నాటి ఆదర్శ గ్రామాన్ని నేటి పాలకులు అవస్థల గ్రామంగా మార్చారని, కష్టాల కడలిలో ఎడ్లంక గ్రామం ఉందని అన్నారు. చుట్టూ సమస్యలు ఉన్నా చెక్కు చెదరని ఆత్మస్థైర్యం కష్టాన్ని ఎదురించి నిలబడే తత్వం గ్రామస్థులకు ఉందన్నారు. తన హయాంలో గ్రామానికి అనేక పనులు చేశానని పక్కా గృహాలు అంతర్గత రహదారులు మంచి నీటి సదుపాయం కృష్ణానదిలో కాజ్వే నిర్మాణం వంటి పనులు చేసి వారి సమస్యల విషయంలో ఎల్లప్పుడూ అండగా ఉన్నానని మండలి అన్నారు. గ్రామంలో మత్స్యకారులకు ఎక్కువగా అండగా ఉన్నానని, వారికి చేపల వేట చేసుకోవడానికి ప్రభుత్వం నుండి అనేక విధాలుగా సాయం అందిచామన్నారు. గడిచిన 4 సంవత్సరాల్లో గ్రామంలో దారి సమస్య ప్రధానంగా ఉందని, వరదలు వస్తే పడవపై వేళ్ళాలని నీరు తగ్గేవరకు దారి లేక స్వచ్ఛందంగా తాటి పట్టెల వంతెనలు ఏర్పాటు చేసుకుని నడిచే పరిస్థితి గ్రామస్థులకు దాపురించిందని అటువంటి పనులు కూడా జరగకుండా ఇక్కడ నేతలు అడ్డుకుంటున్నారన్నారు. ఆ సమస్య నుండి పరిష్కారం కోసం బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఎం.పి, మచిలీపట్నం పార్లమెంట్ కూటమి జనసేన అభ్యర్థి వల్లభనేని బాలశౌరితో మాట్లాడానని నాబార్డ్ నిధులతో ఎంతటి వరద వచ్చినా గ్రామస్థులకు ఇబ్బంది లేకుండా రాకపోకలు కొనసాగించడానికి బ్రిడ్జి నిర్మాణం చేస్తామన్నారు. దాని కంటే ముందుగా గ్రామంలో ఎగువ ప్రాంతంలో కోతకు గురౌతున్న ప్రాంతంలో మూలబండరాళ్ళు వేసి రక్షణ కల్పిస్తామన్నారు. అధికార పార్టీ దుర్మార్గపు ప్రయత్నాల నుండి గ్రామాన్ని రక్షించుకోవడంలో నియోజకవర్గంలోనే మొట్టమొదటి ఉద్యమం ఎడ్లంక గ్రామస్థులు చేసి విజయం సాధించారని అందుకు ముందుగా అభినందిస్తున్నానన్నారు. డంపింగ్ యార్డ్ ఏర్పాటును అడ్డుకునే విషయంలో ఎడ్లంక గ్రామస్థుల పోరాట స్ఫూర్తి తమకు ఆదర్శం అయ్యిందని, భారత రాజ్యాంగ నిర్మాణ డా॥ బిఆర్ అంబేద్కర్ దేశ ప్రజలకు కల్పించిన పౌర హక్కుల ఉల్లంఘన ఈ ప్రభుత్వంలో తీవ్ర స్థాయిలో జరిగిందని ప్రజా స్వేచ్ఛ కరువైందని సెక్షన్ 30 తో అనేక ఉద్యమాలు అణచివేసి వారి స్వేచ్ఛను హరించారన్నారు. గత 2, 3 రోజులుగా శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు తనపై దుష్ ప్రచారం చేస్తున్నారని దివిసీమలో కక్షలు, కార్పణ్యాలు లేకుండా చేసిన ఘనత తమదేనని ఈ విషయం నియోజకవర్గం ప్రజలందరికి అవసరం అని అలాంటి తప్పుడు ప్రచారాన్ని తిప్పి కొట్టాలని పిలుపునిస్తూ తనపై అలాంటి ప్రచారాన్ని సహించేది లేదని మండలి హెచ్చరించారు. రేపు అధికారంలోనికి రాబోయేది ఎన్.డి.ఎ కూటమేనని ఎడ్లంక గ్రామ అభివృద్ధి తమతోనే జరుగుతుందని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ముందుగా గ్రామంలో వేంచ్చేసి ఉన్న బాలకోటేశ్వర స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, తెలుగుదేశం మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, జనసైనికులు గుడివాక శివరామ్, సింహాద్రి పవన్ లతో పాటు పలువురు జనసేన, తెలుగుదేశం పార్టీ నేతలు, గ్రామస్థులు పాల్గోన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

విశాలాంధ్ర-కూచిపూడి : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఐదవ రోజైన గురువారం సిబ్బంది మొవ్వలో గల రెండు పెట్రోల్ బంకులలో సిబ్బందికి వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెట్రోలు బంకులు (ఆయిల్ ఫిల్లింగ్ సెంటర్)లలో అగ్ని ప్రమాదం సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్ని ప్రమాదం జరిగినప్పుడు నివారించడానికి తీసుకోవాల్సిన చర్యలు పై అవగాహన సదస్సులు నిర్వహించి కరపత్రాలు పంపిణీ చేశారు. వాహనాలలో పెట్రోల్ పోసే సమయంలో వినియోగదారులు, సిబ్బంది సెల్‌ఫోన్ వినియోగించ రాదని సూచించారు. అలాగే వాహనాలను రన్నింగ్ లో ఉంచకూడదని హెచ్చరించారు. బ్యాంకులలో పెట్రోల్ నింపేటప్పుడు సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆ రెండు పెట్రోల్ బంకుల సిబ్బందితోపాటు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు, లీడ్ ఫైర్ మెన్ ఎం .యోగా నంద్,టీ.నాగప్రసాద్, ఏ. శ్రీకాంత్, డ్రైవర్లు డి రాంబాబు, జి శీను, ఫైర్ కానిస్టేబుల్స్ ఎల్ వెంగళరావు, ఏ.వి. పూర్ణచంద్రరావు, హెూంగార్డులు డి ఎస్ ఆర్ కే ప్రసాద్, బి కాజయ్య, జి నాగరాజు, జి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద నివారణకు చర్యలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలని ఫైర్ స్టేషన్ అధికారి పి.ఎస్ వివి ప్రసాద్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా 5 వ రోజు అయిన గురువారం అవనిగడ్డ, పులిగడ్డ పెట్రోల్ బంక్‌లో సిబ్బందికి అవగాహన కల్గించారు. పాఠశాలలు, ఆసుపత్రులు వాణిజ్య సముదాయాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణకు చర్యలు సూచించారు. ఫైర్ అలారం మరియు ఫైర్ స్మోక్ డిటెక్టర్లను అవసరమైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసుకోవాలని పాఠశాలలు, ఆసుపత్రులు అగ్ని ప్రమాధాలు జరిగినప్పుడు క్షేమంగా తప్పించుకునేందుకు సరైన ప్రణాళికను రచించి అది అందరికి తెలిసే విధంగా తగు ప్రదేశాల్లో ఉంచాలన్నారు. పాఠశాలలు, ఆసుపత్రుల నందు బయటకు వెళ్ళే మార్గాల్లో ఎటువంటి ఆటంకాలు లేకుండా చూసుకోవాలని తాటాకులు మరియు గడ్డితో చేసిన పై కప్పును పాఠశాలల్లో మరియు ఆసుపత్రులకు వినియోగించకూడదన్నారు. అగ్ని ప్రమాధాలు జరగడానికి ఆస్కారం ఉన్న ప్రదేశాల్లో ముందుగా గుర్తించి ఆ ప్రాంతాలను అగ్ని ప్రమాధ రహితం చేయాలని సూచిస్తూ ప్రమాధాలు జరిగినప్పుడు తప్పించుకునేందుకు డెమో ద్వారా అవగాహన కల్గించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది, ఆ యా పెట్రోల్ బంగ్‌కల యజమానులు, సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

సారూ.... తాగునీరు వచ్చేది ఎలా ?



విశాలాంధ్ర-అవనిగడ్డ : ఇరిగేషన్ అధికారులు, పంచాయితీ సిబ్బంది ప్రతినిత్యం ఈ పంట కాలువ రహదారినే ప్రయాణం చేస్తుంటారు. గత ఆరు రోజుల నుండి ఇరిగేషన్ అధికారులు పంట కాలువ ద్వారా త్రాగు నీటిని విడుదల చేశారు. విడుదల చేసింది మొదలు ఎగువ నుండి తూటు కాడ భారీ స్థాయిలో త్రాగు నీటితో పాటు కొట్టుకురావడంతో సీతాయలంక వద్ద కాలీబాట వంతెనకు తూటు కాడ అడ్డుగా పడి త్రాగు నీటి సరఫరాని భారీ స్థాయిలో అడ్డుకుంటుంది. గత 5 రోజుల నుండి త్రాగు నీరు పూర్తి స్థాయిలో దిగువ గ్రామాలకు సరఫరా కావడం లేదు. మరో 4, 5 రోజుల్లో ఇరిగేషన్ అధికారులు త్రాగునీటి సరఫరా నిలిపివేసే అవకాశాలు ఉన్నాయి. త్రాగు నీటిని విడుదల చేసిన అధికారులు పంట కాలువల వెంబడి ఏ స్థాయిలో త్రాగు నీరు దిగువకు చేరుతుందో కూడా చూడాల్సిన భాద్యత వారిపైనే ఉంది. ఇరిగేషన్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే తూటుకాడ పంట కాలువకు అడ్డుగా ఉండి త్రాగు నీటిని దిగువ ప్రాంతాలకు వెళ్ళకుండా అడ్డుకుంటున్నా కూడా చూడలేని పరిస్థితిలో ఇరిగేషన్ అధికారులు, పంచాయితీ సిబ్బంది ఉన్నారంటే వారి పనితీరు ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా అధికారులు స్పందిస్తారో లేదో వేచి చూడాలి.

గుర్తుతెలియని వృద్ధురాలికి ఆదరణ

విశాలాంధ్ర-చల్లపల్లి : చల్లపల్లి ప్రధాన కూడలిలో ఉదయం నుంచీ అనాధలా కూర్చున్న వృద్ధురాలు రాత్రి వరకూ అలాగే ఉండటంతో సమీప దుకాణదారులు ఆమెను వృద్ధాశ్రమానికి చేర్చిన వైనమిది. చల్లపల్లి ప్రధాన కూడలిలో బుధవారం ఉదయం నుంచీ ఒక వృద్ధురాలు కూర్చుని ఉండగా, దుకాణదారులు మధ్యాహ్నం అల్పాహారం ఇచ్చారు. రాత్రి అయినా ఎవరూ రాకపోవటంతో ఆమెను వివరాలు అడిగారు. నీరసంగా ఉండటంతో వివరాలు సైతం చెప్పే పరిస్థితిలో లేకపోవటంతో ఓఆర్ఎస్ ఇచ్చి, టిఫిన్ పెట్టి ఉపశమనం కలిగించారు. పూలకొట్టు నిర్వాహకుడు ఉప్పాల అమలేశ్వరరావు, మెడికల్ షాపు గుమస్తాలు విస్సంశెట్టి జగదీష్, నారగాని శ్రీనివాసరావు, పండ్ల కొట్టు శ్రీనివాసరావులు వృద్ధురాలి సమాచారాన్ని చల్లపల్లి ఎస్ఐ చినబాబుకు అందించారు. వృద్ధురాలి పరిస్థితిని సీయోను వృద్ధాశ్రమ నిర్వాహకుడు శీలం భాస్కరరావుకు తెలియచేసి ఆమెకు ఆశ్రయం ఇవ్వాల్సిందిగా కోరగా, ఆయన అంగీకరించటంతో ఆశ్రమానికి తరలించారు. గురువారం సైతం వృద్ధురాలు నీరసంగా ఉండటం, ఆమె మాట్లాడే విషయాలు అర్థంకాని రీతిలో ఉండటంతో ఆశ్రమ నిర్వాహకులు, సిబ్బంది ఆమెకు సపర్యలు అందించారు. వృద్ధురాలి గురించి తెలిసిన వారెవరైనా ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం అందించాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

నల్లగట్ల స్వామిదాసు ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-గంపలగూడెం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తిరువూరు శాసనసభ నియోజకవర్గ అభ్యర్థి నల్లగట్ల. స్వామిదాసు శుక్రవారం నాడు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో నామినేషన్ పత్రం దాఖలు చేసిన ఆయన నేరుగా నెమలి శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.అనంతరం మండలం లోని ఉమ్మడిదేవరపల్లిలో ఎన్నికల ప్రచారాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన వెంట తిరువూరు నియోజవర్గ స్థాయి పలువురు పార్టీ ప్రముఖులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో మండలి బుద్ధప్రసాద్

విశాలాంధ్ర-అవనిగడ్డ : మండల పరిధిలోని పాత ఎడ్లంక గ్రామంలో వేంచ్చేసి ఉన్న బాల కోటేశ్వర స్వామి వారిని మాజీ ఉపసభాపతి, ఎన్.డి.ఎ కూటమి అవనిగడ్డ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ దర్శించుకున్నారు. గురువారం రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పాత ఎడ్లంక గ్రామంలో ప్రముఖులు జనసేన పార్టీలో చేరుతున్న సందర్భంగా ఎడ్లంక గ్రామానికి విచ్చేసిన మండలి ముందుగా ఆలయంలోని స్వామి వారిని దర్శించుకుని ఆశీసులు పొందారు. ఆయనతో పాటు జనసేన జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, అవనిగడ్డ మండల పార్టీ అధ్యక్షులు గుడివాక శేషుబాబు, జనసేన పార్టీ నాయకులు మండలి వెంకట్రామ్, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, చెన్నగిరి సత్యనారాయణ,గుడివాక శివరామ్, ఎడ్లంక మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, సింహాద్రి పవన్, మాజీ ఉపసర్పంచ్‌లు ఘంటశాల రాజమోహన్‌రావు, అడపా శ్రీనివాసరావులతో పాటు పలువురు పాల్గోన్నారు.

నేటి నుండి గీతామందిరంలో ప్రతిష్ఠా మహోత్సవాలు

విశాలాంధ్ర-అవనిగడ్డ : గీతామందిరంలో విమాన శిఖర జీవద్వజ ప్రతిష్ఠా మహోత్సవాలు ఈ నె 19 వ తేది శుక్రవారం నుండి 21 వ తేది ఆదివారం వరకు జరుగుతాయని మందిర కమిటీ అధ్యక్షులు యర్రంశెట్టి శ్రీహరి బాబు, అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బోగాది రాములు గురువారం విలేకరులకు తెలిపారు. శ్రీ త్రిదండి అష్టాక్షరి సంపత్ కుమార రామానుజ జియర్ స్వామి దివ్య మంగళ శాసనాలతో వైకానాశాగమ పండితులు నల్లూరి దాసరాధి శ్రీనివాస దీక్షితులు బ్రహ్మత్వంలో కార్యక్రమాలు జరుగుతాయన్నారు. శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు దంపతులు ముఖ్య అతిధులుగా పాల్గోంటారని 19 వ తేది శుక్రవారం ఉదయం 9 గంటలకు వాస్తు హోమంతో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయన్నారు. 20 వ తేది శనివారం ఉదయం విశ్వ కేశన పూజ, అగ్ని మధనం, ఉక్త హోమం, క్షీరాధి పంచ గాల్వాది, జలాధి ఆదివాసం సాయంత్రం 4 గంటలకు విమాన శిఖరం, జీవ ద్వజం, మెఖలాలు, గ్రామోత్సవం, ప్రభాతబలి జరుగుతాయని 21వ తేది ఉదయం 10 గంటలకు ప్రతిష్ఠా మహోత్సవం, పూర్ణాహుతి, స్వామి వారి శాంతి మహోత్సవ కార్యక్రమాలతో ముగుస్తాయని చెప్పారు. అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతాయన్నారు. లక్ష్మీ నారాయణ స్వామి వారి వంశ పారంపర్య ధర్మకర్త పోతరాజు భాస్కరరావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి యార్లగడ్డ శ్రీనివాసరావులు ఈ కార్యక్రమాలను పర్యవేక్షిస్తారన్నారు.

తీర ప్రాంత గ్రామాల అభివృద్ధే లక్ష్యం : మండలి

విశాలాంధ్ర-అవనిగడ్డ : ప్రమాధకర పరిస్థితిలో ఉన్న తీర ప్రాంత గ్రామాల అభివృద్ధే తన మొదటి ప్రాధాన్యం అని మాజీ ఉపసభాపతి, ఎన్.డి.ఎ కూటమి అవనిగడ్డ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి మండలి బుద్ధప్రసాద్ అన్నారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు, బిసి నాయకులు, జనసేన నేత చిలకలపూడి పాపారావు కార్యాలయంలో గురువారం అగ్నికులక్షత్రియుల సంఘ నేతలతో బుద్ధప్రసాద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలి మాట్లాడుతూ మత్స్యకార గ్రామాలు గడిచిన 5 సంవత్సరాల్లో ఏ విధమైన అభివృద్ధికి నోచుకోలేదని రహదారులు లేక అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని, తాను ఎం.ఎల్.ఎ గా ఎన్నికైన వెంటనే ఆ గ్రామాలకు రహదారి సౌకర్యాలు మెరుగుపరచడం ప్రతి ఒక్కరికి త్రాగునీరు అందెలా చూడటమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. తాను గతంలో 3 సార్లు ప్రజా ప్రతినిధిగా పనిచేసిన సమయంలో సముద్రపు కరకట్టలను అభివృద్ధి చేశానని పూర్తిగా కోతకు గురౌతున్న ఈలచెట్లదిబ్బ దివికి రివెట్‌మెంట్ వాలు నిర్మించి గ్రామకోతను నివారించానని ప్రతి గ్రామానికి రహదారిని తీసుకువచ్చానని చెప్పారు. గడిచిన 5 సంవత్సరాల్లో కరకట్ట అభివృద్ధి గురించి కానీ, మిగిలిన రహదారుల గురించి కానీ వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదని దీంతో ఎదురుమొండి, ఎడ్లంక దీవులు నేడు పూర్తిగా కోతకు గురౌతున్నాయని దీనిపై శాస్త్రియ అధ్యాయానం జరగాల్సి ఉందని తాను ఎన్నికైన వెంటనే సమగ్రమైన అధ్యాయానం చేపట్టి రెండు దీవులను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటానని మండలి హామీ ఇచ్చారు. 1977 ఉప్పెన అనంతరం పూర్తిగా మారుభూమిగా మారిపోయిన దివి ప్రాంత నిర్మాణం కోసం తన తండ్రి మండలి వెంకట కృష్ణారావు తాను కృషి చేస్తే నేడు ఎన్నికైన ప్రజా ప్రతినిధి కనీసం నాచుగుంట రహదారి కూడా వేయించలేకపోయారని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వాలు మత్స్యకారుల కోసం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలన్నీ నేడు అడకెక్కాయని నాడు 90 శాతం సబ్సీడీతో మత్స్యకారుకు పడవలు, వలలు, వాహనాలను ఇస్తే వైసిపి ప్రభుత్వం ఆ పథకాలన్నీ రద్దు చేసి బటన్ నొక్కుతున్నాం అంటూ ప్రజలకు రావాల్సిన ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలను పక్కన పెట్టడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. మత్స్యకార గ్రామాలు తమ గ్రామాల్లోని సంఘాలను పటిష్ఠం చేసుకోవాలని అప్పుడే వారికి భద్రత కల్గుతుందని పేర్కోన్నారు. గడిచిన కొద్ది రోజులుగా ఎం.ఎల్.ఎ సింహాద్రి రమేష్ బాబు జనసేన గెలిస్తే భద్రత ఉండదని ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని కక్షలు, కార్పన్యాలను నిలయం అయిన దివిసీమలో శాంతియుత వాతావరణం నెలకొల్పేలా చేసిన కుటుంబం మండలి కుటుంబం అని, బలహీన వర్గాలకు అనగారిన వర్గాలకు ఎవరైనా హానీ చేయాలని చూస్తే తాను రక్షణగా నిలుస్తానని బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ సాంప్రదాయ మత్స్యకారుల సేవాసమితి ప్రధాన కార్యదర్శి లకనం నాగాంజనేయులు, కొప్పనాతి సత్యనారాయణతో పాటు పలువురు అగ్నికులక్షత్రియ నేతలు పాల్గోన్నారు.